ప్రజలందరికీ 'ఆరోగ్య సురక్ష'

- నేటి నుంచి జోన్-5లో వైద్య శిబిరాలు
- ఏర్పాట్లు చేసిన వైద్యాధికారులు


బాపూజీనగర్ యూపీహెచ్‌సీలో వైద్యశిబిరాలపై సమీక్షిస్తున్న జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పక్కాగా నిర్వహించేందుకు జోన్-5కు సంబంధించి యూపీహెచ్‌సీలు సిద్ధం చేశామని జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ తెలిపారు. ఈ మేరకు సంబంధిత పబ్లిక్‌హెల్త్, వైద్య అధికారులతో జెడ్సీ కృష్ణ సమీక్షించారు. జోన్-5 పరిధిలోని యూపీహెచ్‌సీలు బాపూజీనగర్, ములగాడ, కంచరపాలెం (ఆర్పీపేట), కప్పరాడ, రైల్వే న్యూకాలనీ, నరసిం హనగర్, ఇందిరానగర్, శివనగర్, విద్యుత్‌నగర్ (ఎన్‌జీజీవో కాలనీ), అంబేడ్కర్‌కాలనీ, భవానీగార్డెన్స్, ఏఎస్‌ఆర్ నగర్, ఏకేసీ కాలనీ, గాంధీజీవీధి (మల్కాపురం), జ్ఞానాపురం యూపీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలు చేయనున్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడేవారిని జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో గుర్తించారు. జోన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బరువు తక్కువ, రక్తహీనత, ఎదుగుదల లోపం గల పిల్లలను గుర్తించి మందులు అందించనున్నారు. క్రానిక్ వ్యాధులైన క్యాన్సర్, గుండెపోటు, కిడ్నీ సమస్యలు లాంటివి గుర్తించి ఆయా యూపీహెచ్‌సీ పరిధిలోని జరిగే వైద్య శిబిరాలకు టోకెన్లు అందించామని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు, అవసరమైతే ఉన్నత వైద్యశాలలకు తరలించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సిద్ధం చేశామని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఆరోగ్య సిబ్బందితో కలిసి జెడ్సీ కృష్ణ పలు వార్డుల్లో పర్యటించి యూపీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది చేస్తున్న జేఏఎస్ సర్వేను, టోకెన్ల జారీని పరిశీలించారు.


జైభారత్‌నగర్‌లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్యశిబిరాలు నిర్వహించే ప్రాంతాలు..

- బుధవారం బాపూజీనగర్ యూపీహెచ్‌సీ ప్రాంగణం
- గురువారం ములగాడ యూపీహెచ్‌సీ, మల్కాపురం
- 6న కంచరపాలెం(ఆర్పీపేట) రైల్వేగేటు వద్ద
- 7న రైల్వేన్యూకాలనీ యూపీహెచ్‌సీ సుబ్బలక్ష్మి కల్యాణమండప ప్రాంగణం
- 10న ఇందిరాకాలనీ యూపీహెచ్‌సీ, సరస్వతి స్కూల్ గ్రౌండ్, పవనపుత్ర కాలనీ
- 11న శివనగర్ యూపీహెచ్‌సీ ప్రాంగణం, మర్రిపాలెం
- 13న నరసింహనగర్ యూపీహెచ్‌సీ అక్కయ్యపాలెం
- 16న అంబేడ్కర్‌కాలనీ యూపీహెచ్‌సీ మాధవస్వామి కల్యాణమండపం మాధవధార
- 17న భవానీగార్డెన్స్ యూపీహెచ్‌సీ ప్రాంగణం, ఐటీఐ జంక్షన్
- 18న ఏఎస్‌ఆర్‌నగర్-02 యూపీహెచ్‌సీ ప్రాంగణం, మురళీనగర్
- 19న గాంధీజీవీధి యూపీహెచ్‌సీ, మరిడిమాంబ కల్యాణమండపం, మల్కాపురం
- 20న నక్కవానిపాలెం యూపీహెచ్‌సీ ప్రాంగణం
- 21న ఏకేసీ కాలనీ, యూపీహెచ్‌సీ ప్రాంగణం
- 24న ఇందిరానగర్ -3 యూపీహెచ్‌సీ క్రాంతినగర్
- 26న కప్పరాడ యూపీహెచ్‌సీ ప్రాంగణం
- 30న జ్ఞానాపురం యూపీహెచ్‌సీ జోన్-5 ప్రాంగణం

టోకెన్లు జారీ చేశాం



జోన్-5 పరిధిలో 16 యూపీహెచ్‌సీల్లో బుధవారం నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఆరోగ్య సిబ్బందికి విధులు కేటాయించాం. ఇప్పటికే సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి టోకెన్లు జారీ చేశాం. జేఏఎస్ వైద్యశిబిరాలు జరిగే 45 రోజుల పాటు ఆరోగ్య సిబ్బంది విధులకు కచ్చితంగా హాజరుకావాలి. వైద్యశిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాం.

–డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏఎంహెచ్‌వో, పబ్లిక్‌హెల్త్, జోన్-5

వైద్య శిబిరాలను విజయవంతం చేయాలి



45 రోజులు పాటు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను జోన్ పరిధిలోని 13 వార్డుల్లో ఏర్పాటు చేశాం. బుధవారం నుంచి ప్రారంభం కానున్న జేఏఎస్ వైద్యశిబిరాలు విజయవంతం చేయడంలో యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, జోనల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు ఆయా పార్టీల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలి.

–ఆర్‌జీవీ. కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్-5, జ్ఞానాపురం

ప్రాక్టికల్ నాలెడ్జి అవసరం


బుల్లయ్య కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నిర్మించిన గోడ

సీతంపేట: స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాక్టికల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కళాశాల గ్రౌండ్‌లో ఇటుకలతో గోడ నిర్మించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి సదస్సులలో పాల్గొనడం వల్ల ఇంజినీరింగ్ విద్యపై అవగాహన, ప్రాక్టికల్ నాలెడ్జి లభిస్తుందన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి జి.టి.నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలకు సృజనాత్మకత జోడిస్తే భవిష్యత్ బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

మర్రిపాలెం : ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బర్మా క్యాంపులో నివసిస్తున్న గంధ్రేటి శంకరరావు నగరంలో ఎంవీపీ కాలనీలో టీషాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భాస్కర రెడ్డి అనే వ్యక్తి రోజు టీ తాగడానికి షాపునకు వచ్చేవాడు. జీవీఎంసీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సుమారు రూ.10 లక్షలు తీసుకున్నాడు. ఎన్నిసార్లు అడిగినా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు కంచరపాలెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్‌ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మైనర్ హత్యపై నిరసన



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

సీతమ్మధార : చిత్తూరు జిల్లా వేణుగోపాలపురానికి చెందిన మైనర్‌పై సామూహిక లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మధురెడ్డి మాట్లాడుతూ హత్య జరిగి 14 రోజులు గడిచినా నిందితులను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు.హత్యకు గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని రవి, అశోక్ డిమాండ్ చేశారు.

యువకుడి ఆత్మహత్యపై దర్యాప్తు ముమ్మరం


గుర్తు తెలియని యువకుడి మృతదేహం (ఫైల్)

సీతమ్మధార : ఇటీవల గుర్తు తెలియని యువకుడు (28) చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన ఘటనపై ఫోర్తుటౌన్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్కయ్యపాలెం హైవేలో పాత బస్ స్టాప్ సమీపంలో గత నెల 28వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో మర్రిచెట్టుకు ఓ యువకుడు వేలాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమం దించారు. మృతి చెందిన యువకుడి వివరాలు ఇంతవరకు తెలియరాలేదు. సమీపంలోని సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నారు. సీఐ విజయ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం యువకుడి మృతదేశం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు.

రామకృష్ణానగర్‌లో అన్నదానం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో ఆర్.కె.ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతు సత్యనారాయణ, స్థానిక నాయకులు కాళ్ళ సూర్యప్రకాష్, బొడసింగి శ్రీధర్, ముక్కా కిషోర్, కొత్తూరు శ్రీనివాసరావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

బోరు ఏర్పాటుకు భూమిపూజ


బోరు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ శశికళ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు రెడ్డి కంచరపాలెంలో కుంచుమాంబ, దుర్గామాంబ అమ్మవార్ల సతకం పట్టు ఆలయం వద్ద గ్రామస్తుల అభ్యర్థన మేరకు మంగళవారం వార్డు కార్పొరేటర్ కేవీ ఎస్ శశికళ నూతన బోరువెల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు దివాకర్‌రెడ్డి, ధర్మేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సూర్రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాటర్ వర్క్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష పాల్గొన్నారు.

గడపగడపలో సంక్షేమం

వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు


కరపత్రాన్ని అందిస్తున్న కేకేరాజు, రెయ్యి వెంకటరమణ, తదితరులు

మర్రిపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతిగడపకు సంక్షేమం అందుతోందని, ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 51వ వార్డులోని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి మంగళవారం 289 సచివాలయ పరిధిలోని కళింగనగర్ తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో కేవలం రాజకీయ స్వార్థం కోసం రాజకీయాలు చేశారని, ముఖ్యంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిస్వార్థంతో పాలన అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టరు, జేసీఎస్ మండల ఇంచార్జులు అమర్‌రెడ్డి, వసంతల అప్పారావు, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, పార్టీ సీనియర్ నాయకులు బి.తిరుమల రావు, పొన్నాడ అప్పారావు మాస్టర్, పైడి ప్రతాప్, అంబటి శైలేష్, శ్యామ్, వరలక్ష్మి, రత్నం, లత, గణేష్, మోహన్‌రావు, షేక్‌బాజ్జి, శ్రీను, సాధు, భాను, చిన్ని, వినోద్, భోగవల్లి గోవింద్, కె.చిన్నా, రాఘవులు, సంతోష్, వెంకటేష్, రాము, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలందరికీ ఆరోగ్య భాగ్యం


మాట్లాడుతున్న రెయ్యి వెంకటరమణ

మురళీనగర్: పేద ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యం కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు అన్నారు. వార్డులోని అల్లూరి సీతారామరాజునగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆర్యోగ సురక్ష కార్యక్రమంపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేపీ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటికి నిర్వహించిన సర్వేలో ప్రతి కుటుంబ సభ్యుడి ఆరోగ్య వివరాలు వైద్య సిబ్బంది నమోదు చేసి టోకెన్లు ఇచ్చారని చెప్పారు. వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన సర్వే వివరాలను డాక్టర్ కేపీ నాయుడు వివరించారు. కార్యక్రమంలో భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టరు ఎన్.రవికుమార్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, కె.రామకృష్ణారెడ్డి, ఎస్.చంద్రశేఖర్, కే.ఢిల్లీరావు, సీహెచ్ శ్రీను, ఎస్.శ్రీను, బి.శంకర్, పి.చైతు, పి.నాగరాజు, జె.ప్రశాంత్, కె.అప్పారావు, జి.వెంకటరావు, మహిళా నాయకులు బి.సరస్వతి, మెర్సీ, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు,గర్భిణీలకు జగనన్న ఆరోగ్య సురక్ష పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈమేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న మాధవస్వామి కల్యాణమండపంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం ముందస్తుగా వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) డాక్టర్ సీహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, వలంటీర్లు కార్పొరేటర్‌కు బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు మణి, జైపాల్, ప్రసాద్, సచివాలయ హెల్త్, వెల్ఫేర్ సెక్రటరీ భవాని, అంగన్వాడీ టీచరు మౌలాబీబీ, కరిమిరెడ్డి శ్యామ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు

బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: కోడి దొంగతనం కేసులో దళిత యువకుడిపై పద్మనాభం పోలీసుల దాడి దారుణమని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. ఈ మేరకు కంచరపాలెం ఊర్వశికూడలి దళిత సేన కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దొంగతనం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దళిత యువకుడిపై పోలీసులు కాళ్లు విరిగేలా కొట్టడం దుర్మార్గమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నగర పోలీసు కమిషనర్ చూడాలన్నారు. తక్షణమే బాధితుడికి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించి, ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, ప్రధాన కార్యదర్శి చింతలా మల్లికార్జునరావు, కోశాధికారి లంకా రామారావు, సిటీ కన్వీనర్ గొల్లమాల మీనా, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం పరిధి ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో భాద్రపద మాస శుద్ధచవితి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాలరాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు స్వహస్తాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

అర్జీలు స్వీకరించిన కేకే రాజు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14 వార్డులోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. మరి కొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు.

ఘనంగా శ్రీత్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవం


తిరువీధి మహోత్సవంలో పాల్గొన్న నాదస్వర కళాకారులు

సీతంపేట: శ్రీమారుతి నాయీ బ్రాహ్మణ నాదస్వర డోలు కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శంకరమఠంలో శ్రీత్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవం ఘనంగా జరిగింది, ముందుగా తిరువీధి మహోత్సవం నిర్వహించి అనంతరం సంగీత జనకులం ప్రతినిధి ఎ.వెంకటరావు శిష్య బృందం త్యాగరాజ సంకీర్తనలతో సంచరత్న సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శంకరమఠం అధ్యక్షులు డాక్టర్ టి.రవిరాజు పాల్గొని నాదస్వర కళాకారుల సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా నాదస్వర విద్వాన్ వి.తిమ్మరాజు, డోలు విద్వాన్ పి.బంగారయ్యలను ఘనంగా సత్కరించి వారి సంగీత సేవలను కొనియాడారు. చెన్నైకు చెందిన నాదస్వర డోలుకళాకారులచే నిర్వహించిన నాదస్వర కచేరి, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆస్థాన నాదస్వర కళాకారుల కచేరి అలరించింది. ఈ కార్యక్రమంలో వి.నూకరాజు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సంస్థ అధ్యక్షులు ఎల్.కృష్ణ, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.ఆదినారాయణ, కోశాధికారి పి.బంగారయ్య, ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, ఎ.రామకృష్ణ, విశాఖ నలుమూలల నుంచి నాదస్వర కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు చెల్లుచీటీ

సీతమ్మధార : కార్మిక వ్యతిరేక విధానాలను అఖిలపక్ష కార్మిక సంఘాలు ఐక్యంగా తిప్పికొడతాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. అక్టోబర్ 3వ తేదీన వరల్డ్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. నర్సింగరావు మాట్లాడుతూ నాడు లెనిన్ ఇచ్చిన నినాదాంతో ప్రపంచ కార్మికవర్గం ఐక్యంగా పోరాడిందన్నారు.

గర్భిణులు, బాలింతలకు చీరల పంపిణీ


కేజీహెచ్‌లో గర్భిణులు, బాలింతలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్ గైనిక్ వార్డులో నిరుపేద గర్భిణులు, బాలింతలకు మంగళవారం హిమ హ్యూమనిటేరియన్ అసోసియేషన్, శ్రీలక్ష్మి గణపతి సప్లయర్స్ ప్రతినిధులు సంయుక్తంగా చీరలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై వాటిని మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. కేజీహెచ్‌కు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమన్నారు. హిమ సంస్థ చైర్మన్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో కూడా రోగులకు అనేక సేవలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పైలా సన్నిబాబు, సంస్థ గౌరవ అధ్యక్షుడు నరవ రాంబాబు, విఘ్నేష్ ఇన్ఫో అధినేత డాక్టర్ సిరగడం సురేష్, శ్రీలక్ష్మీ గణపతి సప్లయర్స్ అధినేతలు ఎస్.రవి, వెంకట్, కె.వెంకటరమణ, బి.టి.మూర్తి, హిమ ఫౌండర్ టీవీడీ దాస్, లక్ష్మణ్ సింగ్, జీవీ హరి తదితరులు పాల్గొన్నారు.

12న జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్-4 పరిధిలో దుకాణాలు, కల్యాణ మండపాలు, క్యాంటీన్‌కు ఈనెల 12న బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 35వ వార్డు పరిధి స్ప్రింగ్‌రోడ్డులో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయంలో, 31, 35 వార్డుల పరిధిలోకి వచ్చే దుకాణ సముదాయాలు, 39వ వార్డు లక్ష్మీటాకీస్ సమీపాన పద్మానగర్ వాణిజ్య సముదాయంలో, 31వ వార్డులో, 37వ వార్డు రెల్లివీధి ఫిష్‌మార్కెట్ (రోడ్డు సైడ్)కు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు/సంస్థలు జోనల్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు జోన్-4 కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు పర్యవేక్షణ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

నిర్మాణ రంగంలో సృజనాత్మకత అవసరం

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చ ర్ విభాగ విద్యార్థులు వరల్డ్ క్లాస్ నిర్మాణాలు చేపట్టే దిశగా నైపుణ్యాలు పెంచుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. వరల్డ్ ఆర్కిటెక్చర్ డే సందర్భంగా మంగళవారం ఏయూ లోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా వేడుక లు నిర్వహించారు. ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వీసీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సాంకేతికంగా ప్రపంచం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సేవా రంగంతో పాటు నిర్మాణం, పారిశ్రామిక, స్పేస్ రంగాల్లో సాంకేతికాభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతుందన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాలు, ఆవిష్కరణలకు అనుగుణంగా విద్యార్థుల ఆలోచనలు ఉండాలన్నారు.

ఎఫ్‌సీఐలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ


మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ వెంకటరమణ

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం అధ్యాపకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇక్కడి అధ్యాపకులను సత్కరించనున్నట్లు తెలిపారు. ఎఫ్‌సీఐలో పేద విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారన్నారు. ప్రస్తుతం సుమారు 90 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వారిలో 14 మంది బాలికలున్నట్లు తెలిపారు. వీరిలో పదో తరగతి నుంచి పీజీ, బీటెక్ చదువుకున్న వారు కూడా ఉన్నారన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నామన్నారు. ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి లోగోను గురువారం ఆవిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు రవి రాఘవన్, ఎస్.పార్థసారథి, బి.కుముదిని పాల్గొన్నారు.